www.prajasakti.com

# ప్రజాశక్తి

ఆదివారం 28 మే 2023 | 5 | పశ్చిమ గోదావరి



## 18వ రోజు కొనసాగిన రైతుల దీక్షలు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు కోటిగుట్టు ప్రాంతంలో జగనన్న ఇళ్ల స్థలాలకు భూములు ఇచ్చిన రైతుల సమస్యకు పరిష్కారం ఇవ్వాలని కోరుతూ చేపట్టిన దీక్షలు శనివారం 18వ రోజు కొనసాగాయి. దీనిలో భాగంగా బాధిత నిరుపేద రైతులు కుటుంబ సభ్యులతో కూర్చుని నిరసన తెలిపారు. పరిహారం చెల్లించే విషయంలో అధికారులు స్పందించకపోతే తహశీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు నల్లి రామలక్ష్మి, సంబదీవి సాయిబాబు, కారింకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో నిరుపేద రైతులు

# ఖరీఫ్‌కు వేళాయే..!

**1న కాలువలకు నీరు విడుదల**

**రైతులను వెంటాడుతున్న సమస్యలు**

**విత్తనాలపై నామమాత్రపు సబ్సిడీతో మమ**

**కౌలురైతులకు సకాలంలో రుణాలు ఇస్తారా**

**ఆధునికీకరణ లేక ఈ ఏడాదీ రైతులకు కష్టాలే**

**ముందస్తు సాగుపై రైతులకు అవగాహన కల్పించేనా**



ధవళేశ్వరం ఆనకట్ట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగుకు సంబంధించి జూన్ ఒకటిన కాలువలకు సాగునీరు విడుదల చేసేందుకు ఇరిగేషన్ శాఖ సిద్ధమవుతోంది. రబీసాగులో ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ఖరీఫ్ సాగులో ఎదురుకానున్న సమస్యలపై కలత చెందుతున్నారు. ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా నాలుగు లక్షలకుపైగా ఎకరాల్లో వరి సాగవనుంది. దీనికి సంబంధించి విత్తనాలకు దాదాపు 70 శాతానికిపైగా రైతు నుంచి రైతుకు మార్పిడి జరుగుతోంది. 30 శాతం మంది రైతులు విత్తన షాపుల్లో కొనుగోలు చేసుకునే పరిస్థితి ఉంది. తమది రైతు ప్రభుత్వమని చెప్పడం తప్ప విత్తనాల సరఫరాలో రైతులకు సబ్సిడీ అనేది పెద్దగా లేకుండాపోయింది. విత్తనాలకు సంబంధించి కిలోకు రూ.ఐదు మాత్రమే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. 30 కిలోల విత్తన బస్తా దాదాపు రూ.1100 వరకూ ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.150 కూడా ఉండటం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. విత్తనాలకు సంబంధించి 50 శాతం సబ్సిడీ అమలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో విత్తన కొనుగోలు రైతులకు భారంగా మారింది. ప్రభుత్వం విత్తన సబ్సిడీ పెద్దగా ఇవ్వకపోవడంతో విత్తనాలు విక్రయించే రైతులు సైతం ధర ఎక్కువగా నిర్ణయిస్తున్నారు. 75 కిలోల విత్తనాలు రూ.రెండు వేలకుపైగానే చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందిస్తే రైతులకు ఎంతగానో మేలు జరిగే అవకాశమున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

**కౌలు రైతులకు రుణాలొచ్చేనా..?**

రెండు జిల్లాల్లోనూ వ్యవసాయ సాగులో కౌలు రైతులదే కీలక పాత్ర. దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారని, 70 శాతం సాగు వీరే చేస్తున్నారని లెక్కలు చెబుతున్నాయి. సాగు చేసే కౌలురైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి ఎటువంటి మేలూ జరగడం లేదు. భూయజమాని అంగీకారం లేకుండా కౌలుకార్డులు ఇవ్వడం లేదు. కౌలుకార్డులు లేవనే సాకుతో కౌలురైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి ఖర్చవుతోంది. ప్రతి రైతూ రెండెకరాల నుంచి ఐదెకరాల వరకూ కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. అయితే బ్యాంకులు ఇచ్చే పంటరుణాలు మాత్రం కౌలురైతులకు అందడం లేదు. కౌలుకార్డులు అందించే ప్రక్రియ సైతం నిబద్ధతతో అమలు చేయని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా సకాలంలో కౌలుకార్డులు అందించి ఖరీఫ్ సాగుకు అవసరమైన రుణాలు కౌలురైతులకు అందించేనా అనే అనుమానం నెలకొంది. కౌలురైతులకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

**వెంటాడనున్న ఆధునికీకరణ సమస్య**

రెండు జిల్లాల్లో 11 ప్రధాన కాలువలు 300కుపైగా పిల్ల కాలువల ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. ప్రభుత్వం కాలువల ఆధునికీకరణ పనులను పూర్తిగా పక్కన పెట్టేసింది. గడిచిన మూడేళ్లుగా తూడు తీయడం వంటి చిన్నచిన్న పనులు మినహా పూడికతీత, షట్టర్ల మరమ్మతులు వంటి పనులు జరిగిన పరిస్థితి నెలకొంది. దాదాపు రూ.వెయ్యి కోట్లకు సంబంధించిన ఆధునికీకరణ పనులు అలానే ఉండిపోయాయి. వర్షాలు కురిస్తే నారుమడులు, నాట్లు నాటిన పొలాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. దీంతో ఈ ఏడాది రైతులు ఆధునికీకరణ లేమి సమస్యలను ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడనుంది.

**ముందస్తు సాగుపై అవగాహన కల్పించేనా..?**

ప్రతియేటా జూన్ ఒకటో తేదీన సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ నారుమడులు మాత్రం ఆలస్యంగా వేస్తున్న పరిస్థితి ఉంది. దీనికి ప్రధాన కారణం రైతులకు అవగాహన కల్పించకపోవడమేనని చెప్పొచ్చు. ఖరీఫ్ నారుమడులు ఆలస్యం కావడంతో డిసెంబర్ నెలాఖరు వరకూ ఖరీఫ్ మాసూళ్లు సాగుతున్నాయి. దీంతో రబీసాగు ఆలస్యమవుతోంది. ప్రస్తుత ఏడాదినే తీసుకుంటే ఈ నెల 20వ తేదీ వచ్చేవరకూ రబీ మాసూళ్లు సాగుతూనే ఉన్నాయి. మే నెలలో వచ్చిన అకాల వర్షాలకు రబీ పంట దొరికిపోయింది. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఖరీఫ్‌లో ముందస్తు సాగుపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. కాలువలకు నీరు విడుదలైన తర్వాత నారుమడులు త్వరితగతిన వేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

**50 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలు అందించాలి**

**కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి**

ఖరీఫ్ సాగులో 50 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలు అందించాలి. రైతులకు విత్తన సబ్సిడీ అనేది అందకుండా పోతుంది. నాణ్యమైన విత్తనాలు దొరకకపోతే తెగుళ్లబారిన పడి రైతులు పంటను కోల్పోయే ప్రమాదం ఉంది. భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలురైతులందరికీ రైతుభరోసా కేంద్రాల ద్వారా కౌలు కార్డులు అందించి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి.

# ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

**ప్రాంతీయ సదస్సులో అమరావతి జెఏసి ఛైర్మన్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రావు**

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలపై ఎపిజెఎసి అమరావతి 80 రోజులుగా చేపట్టిన ఉద్యమ ఫలితంగానే ప్రభుత్వం కొన్ని ఆర్థిక, ఇతర సమస్యలకు ఒక్కొక్క దశ ఉద్యమంలో ఒక్కొక్క సమస్యకు పరిష్కారం చూపుతూ ఉత్తర్వుల రూపంలో ఉద్యమ కాలంలో విడుదల చేసిందని, కేవలం ఉద్యమం ఫలితంగానే ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు పేర్కొన్నారు. శనివారం ఏలూరులోని టుబాకో మర్చెంట్స్ ఫంక్షన్ హాలులో ఎపిజెఎసి అమరావతి మూడో ప్రాంతీయ సదస్సు ఏలూరు జిల్లా ఛైర్మన్ కె.రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 80 రోజులుగా సమస్యలపై ఉద్యోగులు పోరాటం చేస్తుంటే, ప్రభుత్వం ఏమీ తెలీదన్నట్లు, ఉద్యమం పట్ల చిన్న చూపు చూస్తుందన్నారు. సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, ఉద్యమంపై స్పందించకుండా ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తుంటే ఉద్యమం అంత కసితో ఉధృతమవుతుందే తప్ప వెనుకడుగు వేసేది ఉండదని ఆయన తెలిపారు.

మొదటి దశ ఉద్యమం సందర్భంగా జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ సొమ్ములు, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్, కొత్త జిల్లాలకు 16 శాతం హెచ్‌ఆర్ఎ, ఆర్‌టిసి ఉద్యోగుల ఓటి డబ్బుల చెల్లింపు వంటి జిఒలు ఇచ్చిందని, ఈ జిఒలు విడుదలకు కారణం ఎపిజెఎసి అమరావతి పోరాటమేనన్న సంగతి ఉద్యోగులందరికీ తెలిసిందేనన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఉద్యోగులు మరో చలో విజయవాడ పిలుపునివ్వకముందే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిజాయితీగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం సృష్టించిన ఉద్యోగులు లేని ఉద్యోగ సంఘం నాయకులతో తమ ఉద్యమంపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో స్పష్టత వచ్చే వరకూ ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని దామోదర్‌రావు తెలిపారు. జెఏసి అసోసియేట్ రాష్ట్ర ఛైర్మన్ టివి.ఫణీపేర్రాజు, కోశాధికారి వివి.మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతు ప్రభుత్వం ఉద్యమాన్ని ఆపేందుకు ఎన్ని ఆటంకాలు సృష్టించి, ఎంత నిలువరించినా అంతకు రెట్టింపుగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తారని, అందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులంతా సిద్దంగా ఉన్నరని వారు తెలిపారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో మూడో దశలో ప్రాంతీయ సదస్సులు, అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, ఉద్యమంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని బొప్పరాజు, పలిశెట్టి దామోదరరావు స్పష్టం చేశారు. తొలుత స్థానిక పాతబస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్ నుంచి ఉద్యోగులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సదస్సులో రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్రప్రధానకార్యదర్శి సిహెచ్.కృష్ణమూర్తి, మున్సిపల్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.అర్లయ్య, ఎపి వర్కు ఆర్ట్స్, పిఇటి ఇన్‌స్ట్రక్టర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.శివకుమార్ రెడ్డి, ఎస్‌బిటిఎస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షురాలు దేవి, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు కె.సుమన్, విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆంజనేయకుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ అండ్ మీడియా ఆఫీసర్సు అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, ఎపి జెఏసి అమరావతి రాష్ట్ర నాయకులు జి.జ్యోతి, జెఏసి జిల్లా ప్రధానకార్యదర్శి బి.రాంబాబు, జిల్లా ఛైర్మన్ శివశంకర్, కృష్ణాజిల్లా ఛైర్మన్ తోట వెంకటసతీష్, కర్నూలు జిల్లా ఛైర్మన్ వి.గిరికుమార్‌రెడ్డి. ఉఐటియుసి రాష్ట్ర నాయకులు కృష్ణమాచార్యులు, బండి వెంకటేశ్వరరావు, సిఐటియు రాష్ట్రనాయకులు బి.సోమయ్య మాట్లాడారు.



ప్రాంతీయ సదస్సుకు హాజరైన నేతలు

## తాగునీటిని కలుషితం చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఉండి

తాగునీటిని కలుషితం చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను హెచ్చరించారు. శనివారం మండలంలోని పాములపర్రులో మంచినీటి చెరువును ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాములపర్రు మంచినీటి చెరువుకు నీరొచ్చే మార్గంలో ఆక్వా వ్యర్థాలు, ఆక్వా జలాలను కాలువలో విడిచే వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి చెరువు చుట్టూ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బ్లీచింగ్, స్పటిక కలిపి నీటిని తేటగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు రెండు పూటలా అందించాలని, లేకపోతే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి గ్రామంలో రక్షిత మంచినీటి వినియోగంపై టాంటాం వేసి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్

విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. చెరుకువాడ గ్రామంలోని జగనన్న కాలనీలో లేఅవుట్‌ను ఆమె పరిశీలించారు. రోడ్డు నిర్మాణంపై గృహనిర్మాణ శాఖ డిఇఇ పి.శివరామరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్‌లోని రోడ్లను పకడ్బందీగా నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అనంతరం మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఉండి మండలంలోని విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శుల పనితీరు బాగోలేదని, విధుల్లో నిర్లక్ష్యం వహించడం, రాష్ట్ర ప్రభుత్వం అందించిన యూనిఫారంను ధరించకుండా విధులకు హాజరుకావడం, ప్రజలకు సమయానికి అందుబాటులో లేకపోవడం వంటివి ఉన్నాయని, ఇలాగైతే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి ఎం.రవికుమార్, గృహనిర్మాణ శాఖ ఇఇ బి.వెంకటరమణ, ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందికి ఆదేశాలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

# ఆదర్శ నేత అలుగు చిత్తరంజన్

**సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతగా జనానికి సుపరిచితం**

**ఆచంట ఎంఎల్‌ఎగా ప్రజలకు విశేష సేవలు**

**నేడు చిత్తరంజన్ స్వగ్రామం మత్స్యపురిపాలెంలో 25వ వర్ధంతి, అమరజీవుల సంస్మరణ సభ**

**విచ్చేయనున్న సిపిఎం నేతలు , ప్రముఖులు**

ప్రజాశక్తి - వీరవాసరం

**వనంలో ఎన్నో పూలు పూస్తాయి.. అయితే ఆ వనంలో పూసి వికసించిన ఎర్ర మందారమే మండలంలోని మత్స్యపురిపాలేనికి చెందిన అలుగు చిత్తరంజన్. సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నేతగా పేదల పక్షాన భూమి కోసం, కూలి కోసం, వృత్తి రక్షణ, పేదల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేశారు. సిపిఎం తరపున ఆచంట ఎంఎల్‌ఎగా అటు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజాసంక్షేమంతోపాటు పేదల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించారు. అందుకే చిత్తరంజన్‌ను మత్స్యపురిపాలెం ముద్దుబిడ్డగా అభివర్ణిస్తారు.**

50 ఏళ్ల క్రితం పూర్వం రాష్ట్రంలో ప్రధానంగా రెండే రెండు పక్షాలు ఉండేవి. ఒకటి అధికారపక్షం కాంగ్రెస్, రెండోది ప్రధాన ప్రతిపక్షం కమ్యూనిస్టుపార్టీ. ఆనాడు భూమికోసం, కూలికోసం, వత్తిరక్షణ, పేదల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ ఉధృత పోరాటాలు నిర్వహించింది. ఈ నేపథ్యంలో పేదలంతా కమ్యూనిస్టు పార్టీ వైపే ఉండేవారు. మత్స్యపురిపాలెంతోపాటు స్థానికంగా ఉన్న దళితపేటలు కూడా కమ్యూనిస్టుల వైపు ఉండేవి. ఆ గ్రామం కమ్యూనిస్టు కంచుకోటగా ఉండేది. అలుగు చిత్తరంజన్, ఆయన తండ్రి జార్జి, పిన తండ్రి ఫెడరిక్ గ్రామ కమ్యూనిస్టులు. అలుగు సుదర్శనం, చేరుగొండి ఏసురత్నం (మాస్టారు), అలుగు ప్రసాదరావు, నేతల నతానియేలు, నేతల సుందరరావు, నేతల ఆనందరావు, పోతుల గంగన్న, పోతుల రామ్మూర్తి, యాళ్ల సూర్యారావు, కర్తాక సుందరరావు, చిలకపాటి సంపతరావు, పిల్లి జాన్ ఫెడరిక్, జాన్‌రత్నం తదితర నేతలు అంతా మత్స్యపురిపాలెం వాసులే. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోనూ, అనంతరం సిపిఎంలోను కొనసాగుతూ ప్రజల పక్షాన, సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిన ఘనత వారికే దక్కుతుంది.



**ఉద్యమాల్లో చిత్తరంజన్ చురుకైన పాత్ర**

మత్స్యపురిపాలెం ఎంతోమందిని కమ్యూనిస్టు యోధులను అందించింది. వారి స్ఫూర్తితోనే వచ్చిన అలుగు చిత్తరంజన్ వామపక్ష భావాలు అణువణువునా నింపుకున్నారు. యువజన, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన అనేక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ముఖ్యంగా కూలి ధరలు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యపై ప్రజలను కదిలించి పోరాడారు. ఆ కుటుంబం నుండే వచ్చిన జాన్‌రత్నం, రాజబాబు, విజయ విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుకైన పాత్ర నిర్వహించారు.

**ఆచంట ఎంఎల్‌ఎగా చిత్తరంజన్**

ఉద్యమ, పోరాటాల నేపథ్యం నుండి వచ్చిన యువకుడైన చిత్తరంజన్‌ను 1985లో ఆచంట ఎంఎల్‌ఎ అభ్యర్థిగా సిపిఎం బరిలో నిలిపింది. మహానేత పుచ్చలపల్లి సుందరయ్య తీవ్ర అనారోగ్యంతో ఉండి కూడా ఆనాడు జరిగిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ నేపథ్యంలో చిత్తరంజన్ సిపిఎం తరపున ఘన విజయం సాధించారు. ఎంఎల్‌ఎగా ఐదేళ్లపాటు ప్రజల సంక్షేమం, అభివృద్ధి, నిరుపేద ప్రజల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించారు. ఇళ్ల నిర్మాణం, ప్రజా సమస్యల పరిష్కారంలోను తనదైన శైలిలో ముందుకు సాగేవారు. శాసనసభ్యులకొచ్చే గౌరవవేతనం, ఇతర ప్రతిపైసానూ పార్టీకే జమ చేసి పార్టీ కమిటీ నిర్ణయాలను శిరోధార్యంగా భావించి క్రమశిక్షణగా నడుచుకునేవారు. ఎంఎల్‌ఎ పదవీకాలం అనంతరం సిపిఎం భీమవరం పట్టణ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి సైకిల్‌పైనే నివాస ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్విరామ కృషి చేశారు. ముఖ్యంగా 1986లో వచ్చిన వరదల సమయంలో తన ప్రాణాలకు తెగించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నిస్వార్థ, నిరాడంబర, ఆదర్శ నాయకుడు చిత్తరంజన్ తన స్వగ్రామంలోని అమరజీవులే స్ఫూర్తిగా పేరు ప్రఖ్యాతలు పొందారు.

**నేడు చిత్తరంజన్ 28వ వర్ధంతి, అమరజీవుల సంస్మరణ సభ**

మత్స్యపురిపాలెంలో చిత్తరంజన్ 28వ వర్ధంతి, గ్రామంలోని అమరజీవులందరినీ స్మరించుకునేందుకు సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం వీరవాసరం మండల కమిటీ తెలిపింది. గ్రామంలోని అమరజీవుల స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రజల సమస్యల పరిష్కారానికి, సేవా కార్యక్రమాలను మరింత ఉత్సాహంగా నిర్వహించడానికి ఈ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యవక్తగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వక్తలుగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, ఆచంట మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి, జంగారెడ్డిగూడేనికి చెందిన ప్రముఖ న్యాయవాది మేకా ఈశ్వరయ్య, ఉపాధ్యాయ ఉద్యమ పూర్వ నాయకులు అలుగు ఇజ్రాయేలురాజు, సీనియర్ న్యాయవాది ఎస్ఆర్.శాస్త్రి, ప్రియదర్శిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అలుగు ఆనందశేఖర్, వీరవాసరం వైస్ ఎంపిపి చిలకపాటి ప్రకాశం, మత్స్యపురిపాలెం సర్పంచి కురెళ్ల వెంకటపద్మావతి త్రిమూర్తులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ హాజరు కానున్నారని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించబోయే ఈ సంస్మరణ సభకు ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని మండల కమిటీ కోరింది.

## వైద్యంలో నైపుణ్యతే కీలకం : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైద్యం అందించడంలో నైపుణ్యత ఉన్నప్పుడే విజయాన్ని సాధించగలమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం స్థానిక విష్ణు కాలేజ్ డెంటల్ ఆడిటోరియంలో మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పి)కు నిర్వహించిన 'బేసిక్ లైఫ్ సపోర్ట్ వర్క్ షాప్'కు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వైద్య విద్యలో మెళకువలతో కూడిన నైపుణ్యతను సాధించినప్పుడే వృత్తిలో రాణించగలరని తెలిపారు. పని చేసే చోటే నివాసం ఉండి సేవలందిస్తే స్థానికంగా మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఓర్పు సహనంతో వైద్య సేవలను అందించాలన్నారు. అప్పుడే తదుపరి స్థానాలకు చేరుకోగలరన్నారు. అనుకోని సంఘటన ఏదైనా ఎదురైనప్పుడు సిపిఆర్‌ని ఎలా నిర్వహిస్తారు, నొప్పి లేకుండా ఇంజెక్షన్ ఎలా చేస్తారు, ఇతర వైద్య విధానాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఏ పనికైనా ప్రాక్టికల్స్ అనేవి చాలా ముఖ్యమన్నారు. ఎంఎల్‌హెచ్‌పిలకు శిక్షణ సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డి.మహేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్‌ఒ భానునాయక్, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ నోడల్ అధికారి డాక్టర్ కీర్తి, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

**బాల్య వివాహాల నిరోధంలో సచివాలయ సిబ్బందిదే కీలకపాత్ర**

బాల్య వివాహాలు, బాల కార్మికులను నిరోధించడంలో సంక్షేమం, విద్య కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం స్థానిక విష్ణు కాలేజ్ ఆడిటోరియంలో 'సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, సంక్షేమ పథకాలు' అనే అంశంపై నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ సంక్షేమం, విద్య కార్యక్రమాల అమలులో ఆయా కార్యదర్శులు రెండు కళ్లులా పని చేయాలన్నారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో బడిబయట ఉండరాదన్నారు. డిఎస్‌పి బి.శ్రీనాథ్ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లల కోసం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఉపాధి చట్టం జోలికొస్తే గుణపాఠం తప్పదు

**ఉపాధి హామీ పనుల సందర్శనలో నేతలు**

ప్రజాశక్తి - పెంటపాడు

పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం జోలికి వస్తే రానున్న రోజుల్లో మోడీకి కూలీలు తగిన గుణపాఠం చెబుతారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు హెచ్చరించారు. మండలంలోని దర్శిపర్రు గ్రామంలో ఉపాధి పని ప్రదేశాన్ని నేతలు సందర్శించి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, రంగారావు, పుల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీకి బడ్జెట్లో నిధుల తగ్గింపు సిగ్గుచేటన్నారు. ఒకపక్క వడగాల్పులు వీస్తున్న తరుణంలో ప్రకృతి కల్పించిన చెట్ల నీడ, తెచ్చుకున్న తాగునీరు తప్ప ఎటువంటి సౌకర్యాలూ లేవన్నారు. మందుబాబులు ఖాళీ చేసిన మద్యం సీసాలను పంటకాల్వల్లో వేయడంతో కూలీలకు గాయాలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు పూటలా మస్టర్ విధానం కూలీలకు శాపంగా మారిందన్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పిస్తున్న ఈ పనులకు బడ్జెట్లో నిధులు పెంచాలని, రెండు పూటలా మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, రద్దు చేసిన సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించి తాగునీరు, పని ప్రాంతంలో సౌకర్యాలు కల్పించి పనిముట్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా, ఉపాధి కూలీలు సుంకా శారద, సుంక వరలక్ష్మి, చుక్కా వెంకటలక్ష్మి, కోటి ముత్యాలరావు, తాడి ప్రసాద్ పాల్గొన్నారు.



పెంటపాడులో...

**తాడేపల్లిగూడెం:** ఉపాధి హామీలో తొలగించిన మౌలిక సదుపాయాలన్నీ తిరిగి కల్పించాలంటూ ఉపాధి కూలీలు పని ప్రదేశాల్లో నినదించారు. ఉపాధి పనుల పర్యటనలో భాగంగా శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వెంకట్రావుపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాలను సందర్శించినట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉసిరిమర్తి సుబ్బారావు, చంద్రయ్య, పీతల సంధ్యారావు, తాడేపల్లి ప్రకాష్‌రావు, మాదాసు లాజరు, ఆవాల అప్పారావు, గాడి గంగారత్నం, దాసరి నాగమణి, గాడి ఉష, ఆవాల లక్ష్మీకాంతం, ఆవాల అప్పారావు పాల్గొన్నారు.

**తణుకు రూరల్:** గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగం పెరగడం వల్ల కూలీలు ఉపాధి కోల్పోయారని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. శనివారం మండలంలోని యర్రాయిచెరువులో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని చేసిన తర్వాత కూడా ఎక్కువ సమయం పని ప్రదేశంలో రెండో ఫొటో హాజరు నిమిత్తం ఉండాల్సి వస్తుందని, ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో చాలా ఇబ్బంది పడుతున్నామని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో సాంకేతిక సమస్యలను సృష్టించి కూలీలను ఉపాధి పనులకు దూరమయ్యేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. పాత పద్ధతిలో కొలతల ప్రకారమే పని చేయించాలని. రెండు పూటలా ఫొటో హాజరు రద్దు చేయాలని కోరారు. పని ప్రదేశంలో నీడ, తాగునీరు, మెడికల్ కిట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని, పని అడిగిన ప్రతి కుటుంబానికీ రెండొందల రోజులు పని కల్పించి రోజు కూలి రూ.600 ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పితాని వెంకట భగవాన్, జక్కంశెట్టి గంగాధర్‌రావు, జుత్తిగ లక్ష్మి, పాలా ముత్యాలు, జక్కంశెట్టి రుక్మిణి, కుడిపూడి శ్రీరాములు, చింతపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

**ఉపాధి కూలీలకు సిపిఎం ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ**

**పెనుమంట్ర:** తమవంతు బాధ్యతగా ఉపాధి హామీ కూలీల దాహార్తి తీర్చే కార్యక్రమాలు చేపట్టామని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు అన్నారు. శనివారం పెనుమంట్రలో జాతీయ ఉపాధి హామీ కార్మికులకు పని ప్రదేశంలో సిపిఎం ఆధ్వర్యాన సివిల్ సప్లయీస్ గౌడౌన్ కార్మికుల సహకారంతో సుమారు 200 మందికి మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడగా కెఎస్.ప్రసాద్, చింతపల్లి లక్ష్మీకుమారి, చింతపల్లి లక్ష్మి, చింతపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెనుమంట్రలో మజ్జిగ పంపిణీ


జనాలు లేక వెలవెలబోతున్న పాలకొల్లు వారపు సంత

## ఎండ ప్రభావం.. రోడ్లు నిర్మానుష్యం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో రోహిణి కార్తె ప్రభావం శనివారం తీవ్రంగా ఉంది. ఉదయం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో రోడ్లపై జనసాంద్రత తక్కువగా ఉంది. శనివారం అయినా జనసంచారం తక్కువగా ఉండటంతో వ్యాపారులు వ్యాపారం లేక గగ్గోలు పెడుతున్నారు. వారపు సంత సైతం మధ్యాహ్నం కొనుగోలు దారులు లేక నిర్మానుష్యంగా ఉంది. ప్రధాన రోడ్లు మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారాయి.

## మొగల్తూరులో 38 అక్రమ లే అవుట్లు గుర్తింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రమైన మొగల్తూరులో ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్లు ప్రజలకు తెలిసేలా అధికారులు శనివారం ప్రచారం నిర్వహించారు. మొగల్తూరులో 38 అక్రమ లే అవుట్లను అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని జెసి, సబ్ రిజిస్ట్రార్, సబ్ కలెక్టర్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులకు అందించామని పంచాయతీల విస్తరణ అధికారి మేడిది నవీన్‌కిరణ్ తెలిపారు. అక్రమ లే అవుట్లను కొనుగోలు చేసినవారికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు.


గణపవరం : వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్న వైద్యులు

## బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం నాలుగో సచివాలయం వద్ద శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో బిపి, షుగరు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పిహెచ్‌సి వైద్యులు పి.కిరణ్మయి చెప్పారు. వీరితోపాటు బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 67 రకాల మందులు అందిస్తామని, 14 రకాల రక్త పరీక్షలు చేస్తామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ప్రొవైడర్ దేవిక, ఎఎన్‌ఎం జయమ్మ, హెల్త్ అసిస్టెంట్ వై.యోహాన్, ఆశా వర్కర్లు సిహెచ్.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్ :** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో తిల్లపూడి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు కార్యక్రమాలను డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిపి, షుగరు, ఇతర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందిస్తారని చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 60 ఏళ్లు దాటిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తారన్నారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేస్తారని చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ఆప్తాల్మిక్ అధికారి ఎంఆర్‌కె.రాజు, సూపర్‌వైజర్ వై.నారాయణమూర్తి, ఎంఎల్‌హెచ్‌పి శైలజ, ఎఎన్‌ఎం భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కె.ప్రసాద్, నాగలక్ష్మి, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు 104 సిబ్బంది పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి బివి.రమణ ఆదేశించారు. పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణ ప్రగతిపై అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇంటి స్థలాలు పొందిన ప్రతిఒక్కరూ నిర్మాణాలు ప్రారంభించేలా ఇంజినీరింగ్ సహాయకులు చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ఇంటి నిర్మాణాలు ప్రారంభించినవారు వాటిని త్వరగా పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో ఉండి హౌసింగ్ డిఇ శివరామరాజు, తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపిడిఒ ఎన్.మురళీగంగాధరరావు, హౌసింగ్ ఎఇ బివి.నరసింహరావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## నేరాలు.. ఘోరాలు..

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

విజయవాడకు చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో ఆకివీడులో మరణించిన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన యువకుడు జాన్ షారోన్ (23) కొంతకాలంగా విశాఖ పట్నంలో ఎయిర్ ఫోర్సులో శిక్షణ పొందుతున్నాడు. శనివారం ఉదయం విశాఖపట్నం నుంచి ద్విచక్రవాహనంపై ఏలూరు జిల్లా కైకలూరు మండలం తాడినాడలో ఉన్న తన మిత్రుని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఆకివీడు దాటి ఏలూరు జిల్లా సరిహద్దులో ఉన్న ఉప్పుటేరు వద్ద మలుపులోకి వచ్చేసరికి ఎదురుగా బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


జాన్‌షారోన్ మృతదేహం

## గుర్తు తెలీని వాహనం ఢీకొని..

ప్రజాశక్తి - ఉండి

ఉండి-గణపవరం రహదారిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పాత ఇనుప సామాను వ్యాపారి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఉండి శాంతినగర్‌లో నివాసం ఉంటున్న నడింపల్లి భాస్కర్‌రాజు గణపవరం రోడ్డులో పాత పెట్రోల్ బంక్ సమీపంలో పాత ఇనుప వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వ్యాపారం ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా పెట్రోల్ బంక్ దాటిన తర్వాత ఆదిత్య ఆక్వా ఏజెన్సీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని భాస్కర్‌రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు నడింపల్లి వెంకట సత్యనారాయణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# ప్రమోషన్ కౌన్సెలింగ్ మాన్యువల్‌గా ఇవ్వాలి

### డిఇఒ వెంకటరమణకు యుటిఎఫ్ వినతిపత్రం

ప్రజాశక్తి - భీమవరం


ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రమోషన్స్ కౌన్సెలింగ్ మాన్యువల్‌గా ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం కోరారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటరమణకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీ పాయింట్స్, రిఅపార్షన్ విషయంలో, నిబంధనల ప్రకారం పాయింట్స్ కేటాయించాలన్నారు. 2015 సంవత్సరానికి చెందిన ఉపాధ్యాయులకు పూర్తి పాయింట్స్ కేటాయించాలన్నారు. బదిలీ ఉపాధ్యాయులకు, ప్రమోటిస్ ఉపాధ్యాయులకు అన్ని ఖాళీలు చూపించాలని, ఖాళీలను బ్యాక్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీహైస్కూల్స్‌లో హిందీ, తెలుగు ఉపాధ్యాయులు లేకపోతే, ఆ స్థానంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయిలను కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.రాజశేఖర్, కార్యదర్శులు క్రాంతి కుమార్, జి.రామకృష్ణంరాజు, కె.త్రిమూర్తులు, పి.శ్రీనివాసరాజు, ఇడివి.ప్రసాద్, పి.రామమూర్తినాయుడు, పివి.సత్యనారాయణ, పి.బాలరాజు ఉన్నారు.


డిఇఒకు వినతిపత్రం అదిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# ఇష్టపడి చదివితేనే అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థులు ఇష్టపడి చదివితే అద్భుత ఫలితాలు సాధిస్తారని, ఉన్నత స్థితికి చేరుకుంటారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వీరవాసరం మండలానికి సంబంధించి కొణితివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి యరక రాజు భాస్కర వెంకట వర్మ 571 మార్కులతో మండల స్థాయిలో మొదటిస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా వర్మను స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా ఉన్నత లక్ష్యాలను లక్ష్యంగా చేసుకుని చదువుకోవాలని సూచించారు. క్రీడల్లో కూడా మంచి ప్రావీణ్యం సంపాదించాలని, తద్వారా క్రీడారంగం ద్వారా కూడా విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. సిఎం జగన్ విద్య కోసం రూ.వేల కోట్ల నిధులను ఖర్చు పెడుతున్నారని, నాడు-నేడు పథకంలో ప్రతి స్కూలును కూడా జాతీయ స్థాయి ప్రమాణాలతో అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన, విద్యా కానుక వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఉపసర్పంచి నాగరాజు శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

# నేటి నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ ఆరో తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు, విద్యార్థి లోకాన్ని పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. బిజెపి తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం వల్ల కార్పొరేట్ విద్యావ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిజెపి విధానాలను శరవేగంగా రాష్ట్రంలో అమలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు విద్యార్థి లోకాన్ని పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు విశాఖపట్నం దువ్వాడలో పది రోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వానికి వాలంటీర్లు పట్టుకొమ్మలు : పివిఎల్


పాలకోడేరు : వాలంటీర్లను సత్కరిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న ప్రభుత్వానికి వాలంటీర్లు పట్టుకొమ్మలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. శృంగవృక్షం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, శృంగవృక్షం సచివాలయ వాలంటీర్లకు సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ వచ్చిన తర్వాత ఎలాంటి సిఫార్సులు అవసరం లేకుండా అర్హత ప్రాతిపదికగా పథకాలు అమలు చేయడం విప్లవాత్మకమైన చర్య అన్నారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలిదిండి కృష్ణంరాజు, పెన్మత్స శ్రీనివాసరాజు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, కటిక శ్రీదేవి, కొత్తపల్లి కాశీ విశ్వనాధరాజు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, జంగం సూరిబాబు, చిల్లా అనూష, వైస్ ఎంపిపిలు సోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీతులసి, ఎంపిటిసిలు షేక్ పాపా సాహెబ్, బళ్ల భారతి, ఆరేపల్లి పెద్ద వెంకటస్వామి, మల్లుల సూర్యకళ పాల్గొన్నారు.

**పోడూరు :** వాలంటీర్ వ్యవస్థతో రాష్ట్రంలో పారదర్శకమైన పరిపాలన అందుతుందని వైసిపి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్ మండలంలో ఆచంట నియోజకవర్గంలో ఎనిమిది గ్రామాలకు చెందిన వాలంటీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, ఎంపిడిఒ ఎం.బలరామరాజు, హౌసింగ్ ఎపి సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పెద్దపాటి పెద్దిరాజు, పోతుమూడి రామచంద్రరావు, సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

**ఉండి :** వాలంటీర్లు సంక్షేమ సారధులని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు కొనియాడారు. మండలంలోని కోలమూరు గ్రామ సచివాలయ ఆవరణలో ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు పాల్గొన్నారు. మండలంలోని పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు, కలిగొట్ల, ఎన్‌ఆర్‌పి అగ్రహారం, వాండ్రం గ్రామ సచివాలయాలలోని వాలంటీర్లకు సేవా మిత్రా, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు నడింపల్లి రాంబాబు రాజు, గండ్రాజు రాజేష్‌వర్మ, సూరవరపు వెంకటాచార్యులు, పేరిచర్ల మహేష్, మున్నలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**యలమంచిలి :** గ్రామ వాలంటీర్లు అందరూ రానున్న రోజుల్లో జగనన్న సైనికులుగా పని చేయాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వెంకటరమణ బుజ్జి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సభలో గ్రామ వాలంటీర్లకు సేవా వజ్రా, సేవారత్న, సేవా మిత్రా పురస్కారాలు ఎంఎల్‌ఎ కవురు శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులకు కూడా లేని గౌరవం గ్రామస్థాయిలో వాలంటీర్లకు కలిగిందని, దీనంతటికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కారణమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల వాలంటీర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

**నేడు పాలకొల్లులో...**

**పాలకొల్లు రూరల్ :** పాలకొల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని గ్రామాల వాలంటీర్లు పాల్గొనాలని కోరారు. వాలంటీర్లకు సేవారత్న, సేవా మిత్ర, సేవా వజ్ర పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు.

## శాశ్వత భూ హక్కుతో ప్రజలకు మరింత మేలు : ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రైతులకు, ప్రజలకు మరింత మేలు చేసేవిధంగా సిఎం జగన్ జగనన్న శాశ్వత భూహక్కు పథకాన్ని ప్రారంభించారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం డ్రోన్ సర్వేను ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాడు ఇటువంటి సర్వే జరిగిందని, తిరిగి నేడు సిఎం జగన్ ఆధ్వర్యంలో రైతులకు, ప్రజలకు శాశ్వతంగా భూ హక్కును కల్పిస్తున్నారని చెప్పారు. నేటికి కూడా అనేకమంది రైతులు తమ భూములకు సంబంధించి సమగ్రమైన రికార్డులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మరోపక్క భూ ఆక్రమణలు, కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్ల బారిన పడి ఎంతోమంది రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ డ్రోన్ సర్వే వల్ల రైతులు తమ భూమికి సంబంధించి శాశ్వత భూహక్కు పొందుతారన్నారు. పట్టణంలో కూడా ఈ డ్రోన్ సర్వే వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జిల్లాలో అన్ని పట్టణాల్లో కూడా ఈ సర్వే జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఎసిపి గౌరు, శాస్త్రి, నాయకులు బొక్కా గోపి, చెల్లంకి గిరి, ఎంఎస్ఆర్, రామిశెట్టి జయసూర్య పాల్గొన్నారు.

## 'కంటి వెలుగు'తో దృష్టి లోపాలు సరిచేసుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం


గ్రామాల్లో ఏర్పాటు చేసే వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో స్థానికులు దృష్టి లోపాలు సరి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని కాశిపాడు గ్రామ సర్పంచి కోట నాగేశ్వరరావు అన్నారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ప్రియాంక మాట్లాడుతూ ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పరీక్షలు చేయించుకుంటే కంటిలోని లోపాలు సరి చేసుకోవచ్చని చెప్పారు. షుగర్ వ్యాధి ఉన్నవారు నెలకి రెండుసార్లు కంటి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. శనివారం 73 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యులు చెప్పారు. వారందరికీ కళ్లజోళ్లు పడతాయని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాశిపాడు ఎంపిటిసి సభ్యులు జంపన పద్మావతి రమేష్, వైసిపి నాయకులు చిన్నం సిల్వర్ స్టార్ రాజు, సొసైటీ కార్యదర్శి ఐ.రామకృష్ణంరాజు, గణపవరం సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఆర్‌డి.రామారావు, ఆరోగ్య సహాయకులు నామాల రాజు, వైద్య సిబ్బంది మేరిగోల్డ్, రమ్య, ఆశాలు పాల్గొన్నారు.

# ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - అత్తిలి

ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కె.ధర్మేంద్ర అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు హాజరై మాట్లాడారు. వైసిపి ఉద్యోగులకు, కార్మికులకు చేసిన అనేక వాగ్దానాలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ఆందోళన చేస్తున్న సంఘాలను నిర్బంధించడం తప్ప వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఏ రకమైన చొరవ తీసుకోకపోవడం దారుణమన్నారు. నిర్బంధాల ద్వారా ఉద్యమాలు ఆగవని, చర్చించడం ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సిఐటియు ఆధ్వర్యంలో రంగాల వారీగా సమస్యల మీద అధ్యయనం చేసి ఆందోళన చేపట్టాలని సమావేశం నిర్ణయించిందని అన్నారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, మాధవి, మల్లేశ్వరి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంపిపి వాసురెడ్డి


ప్రజాశక్తి - పెనుమంట్ర

సిఎం జగన్ విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారని, అందుకు నిదర్శనం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఉత్తీర్ణత పెరగడమేనని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పెనుమంట్ర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 567 మార్కులతో నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పెనుమంట్ర హైస్కూల్ విద్యార్థిని గోవిందరాజు హారతికి ప్రోత్సాహ బహుమతిగా రూ.పది వేలు, 558 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన పెనుమంట్ర విద్యార్థిని అండలూరి మహిమకు రూ.ఎనిమిది వేలు, 544 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన మాముడూరు హైస్కూల్ విద్యార్థిని వివిఎస్ ఎల్.కామాక్షికి రూ.ఆరు వేలు ఎంపిపి వాసురెడ్డి తన సొంత నగదును అందించారు. తహశీల్దార్ దండు అశోక్ వర్మ ఒక్కో విద్యార్థినికి రూ.ఐదు వేలు చొప్పున నగదు ప్రోత్సాహం అందించారు. ఈ క్రమంలో ఆయా శాఖల అధికారులు వారి విధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, ఎంఇఒ డి.శారద జ్యోత్స్న పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామీణ ప్రాంతాల్లో డైమండ్స్ లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృత పరుస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా కొప్పిశెట్టి రమణయ్య, జోన్ ఛైర్‌పర్సన్‌గా పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, కార్యదర్శులుగా మద్దూకూరి మెహర్ ప్రసాద్, కాళ్ల గోపికృష్ణ, ట్రెజరర్‌గా మునగాల జితేంద్ర కుమార్, ఛైర్ పర్సన్‌గా కోనా హనుమాన్, వైస్ ప్రెసిడెంట్‌గా వేగేశ్న రామరాజు, బోళ్ల రాము, బుద్దాల విజయ్‌బాబు, కోటి విజయ్ కిషోర్, సర్వీస్ ఛైర్‌పర్సన్‌గా లయన్ కోనా శ్రీనివాస్, కమ్యూనికేషన్ ఛైర్‌పర్సన్‌గా, లయన్ శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా లంకా శ్రీనివాస్, యర్రా నవీన్ కుమార్, పట్నాల రామకృష్ణ, పెన్మేత్స రాజగోపాల్‌రాజు, డైరెక్టర్ తాడినాడ అనంద్ స్వరూప్, గన్నమని దొరబాబు నియమితులయ్యారు. అనంతరం వారు భీమవరంలో జరుగుతున్న జిల్లా మల్టీ కాన్వన్షన్‌కి తరలివెళ్లారు. గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.


మురళీకృష్ణంరాజును అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

## నేడు సరిపల్లిలో శ్రీనివాసరావు వర్ధంతి సభ

ప్రజాశక్తి - గణపవరం

కేశవరం ఏరియా సిపిఎం నాయకులు పట్నాల శ్రీనివాసరావు వర్ధంతి సభ ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు సరిపల్లి ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల నాయకులు పి.గోవిందు తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శి సభ్యులు చింతకాయల బాబురావు, సిఐటియు జిల్లా కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణరావు, సిపిఎం మండల కార్యదర్శి పిచ్చెట్టి నరసింహమూర్తి పాల్గొంటారని చెప్పారు. సభకు మండలంలో ఉన్న పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

## టిడిపికి మాజీ ఎంఎల్‌సి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

రాజమండ్రి మహానాడు వేడుకలో వేదిక మీద నారా చంద్రబాబు నాయుడుకు మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రూ.రెండు లక్షల చెక్కును విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అంగర రామ్మోహన్‌ను పలువురు అభినందించారు. రాజమండ్రి మహానాడు వేదిక మీద జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రాజమండ్రి అర్బన్, రూరల్ నియోజకవర్గాల జన సమీకరణ వివరాలను అంగర వివరించారు.

## చెన్నకేశవ స్వామి సన్నిధిలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉప్పులూరు గ్రామంలో ఉన్న చెన్నకేశవ స్వామిని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు (వాసు) దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉప్పులూరు ఎంపిటిసి సభ్యులు నిమ్మల కేశవకుమార్ ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు వారు ఉప్పులూరు గ్రామం విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ చెన్నకేశవ స్వామిని దర్శించుకోవడం చాలా ఆనందదాయకమన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పాలన సాగుతుందని, బడుగు, బలహీన వర్గాలవారు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఉప్పులూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మను దర్శించుకున్న కన్నబాబు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మవారిని శనివారం మత్స్య శాఖ కమిషనర్ కన్నబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ కొల్లాటి రామారావు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం శేష వస్త్రం అందించారు.

## వేలంలో ఆలయానికి రూ.74,730 ఆదాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు యాత్రికులు సమర్పించిన చీరలు, పంచెలు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.74,730 ఆదాయం వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు దండు వెంకట కృష్ణంరాజు, పాలకమండలి సభ్యులు, యాత్రికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిసి కులాల జనగణన జిఒ విడుదలపై హర్షం

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్రంలో బిసి కులాల జనగణన అధ్యయన కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి జిఒ విడుదల చేయడం హర్షణీయమని రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి అన్నారు. గణపవరంలో శనివారం ఆమె స్వగృహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బిసి జనగణన జరగడం వల్ల బిసిలకు జనాభా ప్రాతిపదికన రావాల్సిన హక్కులు, ఉద్యోగాలు, రాజకీయ ప్రాధాన్యత సంక్షేమ పథకాలు దక్కుతాయన్నారు. జిఒ విడుదల చేసినందుకు వైఎస్.జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం వైసిపి నాయకులు రొంగల శ్రీనుశెట్టి, త్యాగరాజు, చైతన్య, మణికంఠ, సాయికుమార్ పాల్గొన్నారు.

## 31 నుంచి యోగా శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక పతంజలి యోగా కేంద్ర కార్యక్రమాల్లో భాగంగా 22 రోజులు పాటు ఉచిత పతంజలి యోగారోగ్య శిక్షణ తరగతులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. స్థానిక ఐఎంఎ హాలులో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. అదనపు వివరాల కోసం స్థానిక పతంజలి యోగాశ్రమం కార్యదర్శి కుంకుట్ల సత్యనారాయణను 8978058959 సంప్రదించవచ్చని తెలిపారు.